సాక్షి విశాఖపట్నం

సోమవారం, 1, ఏప్రిల్, 2024


ధోని.. ధోని..


రిషభ్ పంత్‌ను అభినందిస్తున్న అక్షర్‌పటేల్


షాట్‌కు ప్రయత్నిస్తున్న డీసీ బ్యాటర్ వార్నర్

జోష్




ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు సభ్యుల కేరింతలు


యువత కేరింతలు


వికెట్ తీసిన ఆనందంలో డీసీ ఆటగాళ్లు


చీర్ బ్యూటీస్







విశాఖ స్పోర్ట్స్: ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ ఐపీఎల్ మ్యాచ్ విశాఖ అభిమానులకు ఫుల్‌జోష్‌ను అందించింది. హోం జట్టుగా బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ బోణీ కొట్టింది. ఆదివారం సెలవు దినం కావడంతో నగర క్రికెట్ అభిమానులు వైఎస్సార్ స్టేడియానికి పోటెత్తారు. ఫలితంగా స్టేడియం పూర్తి సామర్థ్యంతో నిండిపోయింది. హోం జట్టుగా బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్యాన్స్‌తో పాటు సీఎస్‌కే అభిమానులు పెద్ద సంఖ్యలో మ్యాచ్‌కు తరలివచ్చారు. ముఖ్యంగా ధోని.. ధోని అంటూ స్టేడియం దద్దరిల్లింది. 'కేవలం ధోని కోసమే ఈ మ్యాచ్‌కు వచ్చాను. ఈ రోజు నీవు బ్యాటింగ్ చేయాలి.. ఎందుకంటే నీవు తొలి వన్డే సెంచరీ సాధించింది ఇక్కడే..' అంటూ అభిమానులు ప్లకార్డులు ప్రదర్శించారు. వారు కోరుకున్నట్టు గానే ధోని చివర్లో బ్యాటింగ్‌కు దిగి.. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో అభిమానుల్లో కావాల్సినంత ఉత్సాహం నింపాడు. డేవిడ్ వార్నర్ అభిమానులు సైతం ఆయన ఫొటోలు ప్రదర్శిస్తూ కేరింతలు కొట్టారు. ఢిల్లీ క్యాపిటల్స్ తరపున వార్నర్, రిషభ్ పంత్, పృథ్వీషా 'రన్' రంగం సృష్టించగా.. చెన్నై సూపర్‌కింగ్స్ తరఫున రహానే, మిచెల్, ధోని అలరించారు. వార్నర్ ఇచ్చిన క్యాచ్‌ను పక్షిలా ఎగురుతూ పతిరన పట్టిన క్యాచ్ మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. తుదకు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టే పైచేయి సాధించి 20 పరుగుల తేడాతో నెగ్గి గెలుపు బోణీ కొట్టింది.




తగ్గేదేలే..




స్టేడియం బయట కోలాహలం

న్యూస్‌రీల్

కేకేఆర్ జట్టు వచ్చేసింది


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు సభ్యులు

గోపాలపట్నం: కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు సభ్యులు బెంగళూరు నుంచి ఆదివారం మధ్యాహ్నం విశాఖ చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో వీరికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు స్వాగతం పలికారు. ఈ నెల 3న వైఎస్సార్ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుతో కేకేఆర్ తలపడనుంది. వీరిని చూసేందుకు క్రికెట్ అభిమానులు అధిక సంఖ్యలో ఎయిర్‌పోర్టుకు తరలివచ్చారు. రోడ్డు మార్గంలో నోవాటెల్ హోటల్‌కు ఆటగాళ్లు బయలుదేరారు.

అప్పన్న సన్నిధిలో గంగూలీ


కప్పస్తంభం వద్ద గంగూలీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఐపీఎల్ ఢిల్లీ టీమ్ డైరెక్టర్ సౌరవ్ గంగూలీ దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఈవో శ్రీనివాస మూర్తి గంగూలీకి పూల మాలవేసి స్వాగతం పలికారు. అనంతరం కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని ఈవో అందజేశారు.

స్పెషల్ రైళ్లు పొడిగింపు

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల సౌకర్యార్థం పలు రద్దీ మార్గాల్లో ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో నడుస్తున్న ప్రత్యేక రైళ్లు మరికొంత కాలం పొడిగిస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. • విశాఖపట్నం – సికింద్రాబాద్ – విశాఖపట్నం (08579/08580) వీక్లీ స్పెషల్ జూన్ 27 వరకు పొడిగించారు. • విశాఖపట్నం – తిరుపతి – విశాఖపట్నం (08583/08584) వీక్లీ స్పెషల్ జూన్ 25 వరకు పొడిగించారు. • విశాఖపట్నం – బెంగళూరు – విశాఖపట్నం (08543/08544) వీక్లీ సూపర్‌ఫాస్ట్ స్పెషల్ జూలై 1 వరకు పొడిగించారు. • విశాఖపట్నం – కర్నూలు సిటీ – విశాఖపట్నం (08585 /08586) వీక్లీ స్పెషల్ జూన్ 26 వరకు పొడిగించారు.

ఎట్టకేలకు వంశీకి ఊరట!

సాక్షి, విశాఖపట్నం: విశాఖ దక్షిణ టికెట్‌ను ఎట్టకేలకు వంశీకృష్ణ శ్రీనివాస్‌కు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఖరారు చేశారు. ఈ సీటు తనకే కేటాయించారంటూ ఆయన కొన్నాళ్లుగా చెప్పుకొంటున్నారు. అధిష్టానం నుంచి మాత్రం అధికారికంగా ప్రకటన వెలువడలేదు. దీంతో ఆ నియోజవర్గంలో జనసేన సీటును ఆశించిన ముగ్గురు నాయకులు వంశీ అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. స్థానికేతరుడు.. ఓడిపోయే నాయకుడికి దక్షిణంలో సీటెలా ఇస్తారంటూ వీరు అభ్యంతరం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో తన పేరును అధికారికంగా ప్రకటించాలని వంశీ ఎంత మొత్తుకున్నా ఆ పార్టీ పెద్దలు పట్టించుకోలేదు. ఈలోగా వంశీకి టికెట్ వట్టిదేనంటూ సొంత పార్టీలోని ప్రత్యర్థులు ప్రచారాన్ని తీవ్రతరం చేశారు. ఇప్పటికే ఉమ్మడి విశాఖ జిల్లాలోని అనకాపల్లి, యలమంచిలి, పెందుర్తి సీట్లను వెల్లడించిన జనసేన విశాఖ దక్షిణ సీటు ప్రకటించకపోవడం వీరి ప్రచారానికి బలం చేకూర్చినట్టయింది. ప్రతికూలతల మధ్య నియోజకవర్గంలో ప్రచారాన్ని మొదలెట్టిన వంశీ.. త్వరగా తనకు సీటు ఖరారు చేసినట్టు ప్రకటించకపోతే క్యాడర్ మరింత గందరగోళానికి గురవుతుందంటూ ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో దాదాపు నెల రోజులు ఊరించి ఆదివారం టికెట్ వంశీకే కేటాయించినట్టు పవన్ అధికారిక ప్రకటించారు.

లక్ష్యానికి మించి వసూలు

- రూ.450.90 కోట్లు వసూలైన ఆస్తి, ఖాళీ జాగా పన్నులు
- నగర ప్రజలకు కమిషనర్ సాయికాంత్‌వర్మ కృతజ్ఞతలు



డాబాగార్డెన్స్: జీవీఎంసీలో ఆస్తి, ఖాళీ జాగా పన్నుల రూపేణా 2023–24 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి వసూలైంది. రాష్ట్రంలో అతి పెద్ద కార్పొరేషన్ అయిన జీవీఎంసీ పరిధిలో 6,13,150 ఆస్తి, ఖాళీ జాగా అసెస్‌మెంట్లు ఉండగా.. వీటి ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.450.90 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్నుపై వడ్డీ మాఫీ చేయడంతో ప్రజలు, వివిధ సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. జీవీఎంసీ 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.422.93 కోట్లు వసూలు చేసింది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది అదనంగా రూ.29 కోట్లు వసూలైంది. అదనపు కమిషనర్(రెవెన్యూ), డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ), జోనల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి ఫలితంగా ఆదివారం రాత్రి 7 గంటల వరకు రూ.450.90 కోట్లు వసూలైందని కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. రాత్రి 12 గంటల వరకు అన్ని సౌకర్య కేంద్రాలు పని చేస్తున్నందున ఈ వసూళ్లు ఇంకా పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. సకాలంలో ఆస్తిపన్ను చెల్లించిన ప్రతి ఒక్కరికీ, సహకరించిన మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు, అధికారులకు కమిషనర్ కృతజ్ఞతలు చెప్పారు.

పన్ను వసూళ్లు ఇలా..

పరిధి	అసెస్‌మెంట్లు	వసూలైన మొత్తం (రూ.కోట్లలో) 2022-23	2023-24
జీవీఎంసీ	5,64,531	400.90	429.90
భీమిలి	23,972	9.65	9.08
అనకాపల్లి	24,647	12.38	రూ.11.92
మొత్తం	6,13,150	422.93	450.90

కూటమితో మైనార్టీలకు భద్రత కరువు

- మైనార్టీలకు గౌరవం ఇచ్చింది జగన్ ప్రభుత్వమే..
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి


ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైవీ సుబ్బారెడ్డి, అమర్‌నాథ్, కోలా గురువులు తదితరులు

గాజువాక : బీజేపీ, టీడీపీ, జనసేన కూటమితో రాష్ట్రంలోని మైనార్టీలకు భద్రత ఉండదని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. గాజువాక దారుల్ ఉలూమ్ ఇన్సాకియా మసీదులో కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ప్రసంగించారు. మైనార్టీలను చిన్నచూపు చూస్తూ వారి మనుగడకు భంగం కలిగించే విధంగా వివిధ చట్టాలను తీసుకొస్తున్న బీజేపీతో టీడీపీ, జనసేన పార్టీలు చేతులు కలపడమంటే ముస్లిం వ్యతిరేక నిర్ణయాలకు మద్దతు ప్రకటించినట్టేనన్నారు. ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ పెద్దపీట వేసిందని, వారిని కంటికి రెప్పలా కాపాడుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవిధంగా ముస్లిం మైనార్టీలు సహకరించాలని కోరారు. గాజువాక ఎమ్మెల్యేగా గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించడం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడం కోసం అల్లాను ప్రార్థించాలని కోరారు.

ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ కృషి

గాజువాక ప్రాంతంలో అధిక సంఖ్యలో ఉన్న ముస్లింల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ అనేక కార్యక్రమాలను చేపట్టిందని గాజువాక వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రాష్ట్రంలో ముస్లింలకు గౌరవ స్థానం కల్పించింది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనన్నారు. 2019 ఎన్నికల్లో ఐదుగురు ముస్లింలకు జగన్‌మోహన్‌రెడ్డి టికెట్లు ఇచ్చారని, అందులో నలుగురు అభ్యర్థులు విజయం సాధించారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కూడా ముస్లింల గౌరవాన్ని మరింత పెంచే విధంగా ఏడుగురికి టికెట్లు కేటాయించారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇవ్వడం వల్ల వారి కుటుంబంలో ఎంతోమంది ఉన్నతస్థాయికి ఎదగడానికి అవకాశం కలిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, ఎస్.ఎ.రెహ్మాన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నాయకులు మంత్రి రాజశేఖర్, ఉరుకూటి రామచంద్రరావు, ఎస్.ఎం.డి.గౌస్, దొడ్డి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు సరికొత్త రికార్డు

- పోర్టు చరిత్రలోనే అత్యధిక సరుకు రవాణా
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల రవాణా
- గతేడాది 73.75 ఎంఎంటీ రికార్డును తిరగరాసిన సంస్థ



విశాఖ సిటీ: విశాఖ పోర్టు దేశంలో అగ్రగామి పోర్టుగా అవతరించేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది. ఒకవైపు ప్రైవేటు పోర్టుల నుంచి పోటీ నెలకొన్నప్పటికీ.. ధీటైన ప్రగతిని సాధిస్తోంది. సాంకేతికత, యాంత్రీకరణతో సరుకు రవాణాలో చరిత్రను తిరగరాసింది. 2023–24లో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసి సరికొత్త రికార్డు నెలకొల్పింది. తద్వారా గత ఏడాది చేసిన 73.75 మిలియన్ మెట్రిక్ టన్నుల రికార్డును చెరిపేసింది. ఈ రికార్డు విశాఖ పోర్టు సామర్థ్యాన్ని తెలియజేయడమే కాకుండా మారీటైం సెక్టార్‌లో పోర్టు ప్రాముఖ్యతను మరో మారు తెలియజేసింది. పోర్టు ఈ సాధించిన ఈ ఘనత పట్ల పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు అహర్నిశలు శ్రమించిన పోర్టు సిబ్బందిని ప్రశంసించారు. ఈ ఘనత పోర్టులో నూతన శకానికి నాంది పలుకుతుందని, పోర్టు సామర్థ్యానికి ఇది గీటు రాయి అని అన్నారు.

కోవిడ్ సమయంలో కూడా..

కోవిడ్–19 సమయంలో ప్రజా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిన సమయంలో కూడా విశాఖ పోర్టు రెండేళ్ల పాటు సరుకు రవాణాలో ప్రగతిని కనబరిచింది. ఈ ఏడాది క్రూడ్ ఆయిల్ రవాణాలో 27 శాతం, ఇనుప ఖనిజం 12 శాతం, ఎరువులు 6 శాతం పెరుగుదలను నమోదు చేశాయి. 43 బీమ్ కలిగిన బేబీ కేప్ నౌకలు గత ఏడాదితో పోలిస్తే అధికంగా ఇన్నర్ హార్బర్‌లో కార్యకలాపాలు నిర్వహించాయి. పోర్టులోకి వచ్చిన నౌకల్లో సైతం 35 శాతం పెరుగుదల నమోదైంది.


వీసీటీపీఎల్ కూడా 28 శాతం అధికంగా..

విశాఖ కంటైనర్ టెర్మినల్ సైతం 28 శాతం అధికంగా 6.65 లక్షల టీఈయూలను హ్యాండిల్ చేసింది. ప్రీ బెర్తింగ్ డిటెన్షన్‌లో 68 శాతం, టర్న్ అరౌండ్ టైం, అవుట్‌పుట్ పర్ షిప్ బెర్త్ డేలో 10 శాతం, ఐడిల్ టైం బెర్తింగ్‌లో 8 శాతం మెరుగుదలను నమోదు చేసింది.

గత ఐదేళ్లలో సరుకు రవాణాలో ప్రగతి

2019-2020	72.72 మి. మెట్రిక్ టన్నులు
2020-2021	69.84 మి. మెట్రిక్ టన్నులు
2021-2022	69.03 మి. మెట్రిక్ టన్నులు
2022-2023	73.75 మి. మెట్రిక్ టన్నులు
2023-2024	81.09 మి. మెట్రిక్ టన్నులు

భీమిలి జెడ్పీటీసీ వెంకటప్పడు సస్పెన్షన్


వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయానికి ఇచ్చిన ఫిర్యాదు, సస్పెన్షన్ పత్రాన్ని చూపిస్తున్న భీమిలి మండల నాయకులు

భీమునిపట్నం : వైఎస్సార్ సీపీలో పదవులు అనుభవిస్తూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, శింగనబంద సర్పంచ్ గాడు వెంకటనారాయణలను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రకటించారు. పార్టీలో గౌరవం కల్పించడంతోపాటు ఉన్నత పదవులు కట్టబెడితే కనకపు సింహాసనం మీద శునకం మాదిరిగా వ్యవహరించారన్నారు. ఈ సస్పెన్షన్ వేటు ఆయనతో ఉన్న మరికొందరిపై కూడా ఉంటుందని పేర్కొన్నారు.

వారు టీడీపీకి కోవర్టులు

భీమిలిలోని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు దాట్ల పెదబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన ప్రస్తుత నాయకులంతా 2019 ఎన్నికల తరువాత ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కాళ్లావేళ్లా పడితే పార్టీలో చేర్చుకున్నారన్నారు. మొదటి నుంచి టీడీపీకి కోవర్టులుగా వ్యవహరిస్తున్న వీరు భీమిలి మండల ప్రజా సంక్షేమాన్ని మరచి స్వార్థప్రయోజనాలు నెరవేర్చుకున్నారన్నారు. డీఎల్‌డీఏ చైర్మన్‌గా అవకాశం కల్పించి, జెడ్పీటీసీ సభ్యునిగా ప్రత్యేక శ్రద్ధ చూపి గెలిపిస్తే తిన్నింటివాసాలు లెక్కపెట్టారన్నారు. ఇలా రెండు పదవులు అప్పగిస్తే ఇప్పుడు వైఎస్సార్‌సీపీపై అక్కసుతో భూకబ్జాదారులతో కుమ్మక్కయ్యారన్నారు. వెంకటప్పడుతో ఉన్నవాళ్లంతా పెద్దగా గుర్తింపులేని వ్యక్తులన్నారు. ప్రస్తుతం మండలంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగానే ఉన్నారన్నారు.గంటా శ్రీనివాసరావుతో వ్యాపార లావాదేవీలు, వ్యక్తిగత ప్రయోజనాల కారణంగానే మొదటి నుంచి వైఎస్సార్‌సీపీలో నీచపు కార్యక్రమాలకు పాల్పడ్డారన్నారు. వీరి చేష్టలను నియోజకవర్గ ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు చిల్ల హరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చెల్లూరి నగేష్, సమ్మిడి శ్రీనివాసరావు, బోనిల సన్నిబాబు, పొట్నూరు చంద్రశేఖర్, మజ్జి సూరినాయుడు, కొల్లి కోటిరెడ్డి, వెంపాడ సూరిబాబు, బొడ్డు దుర్గారావు, ముద్దాడ సూరప్పడు, అక్కరమాని రమణ, మల్లేటి హరి, పల్లా సన్యాసిరావు, మద్దిల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 500 మంది చేరిక


మంత్రి అమర్‌నాథ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర మంత్రి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ సమక్షంలో 500 మందికిపైగా టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. జీవీఎంసీ 68వ వార్డు మిందిలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. కురందాసు శేఖర్, అచ్చిబాబు, వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం నాయకుడు బొండా ఉమా మహేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, గాజువాక బాక్సర్స్ అసోసియేషన్ నాయకుల ఆధ్వర్యంలో గాజువాక, నాతయ్యపాలెం, అగనంపూడితో పాటు పలు ప్రాంతాలకు 500 మందికి పైగా టీడీపీ, జనసేన నాయకులు పార్టీలో చేరారు. వీరికి అమర్‌నాథ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కురందాసు శేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన విధానాలు, విలువలు నచ్చి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు వెల్లడించారు. అమర్‌నాథ్ విజయానికి సమష్టిగా కృషి చేస్తామన్నారు. దిలీప్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, జోసఫ్, విజయ్‌రెడ్డి, మహేష్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల చైతన్యం కోసం విస్తృత కార్యక్రమాలు

- అందులో భాగమే 'మన పోలింగ్ బూత్ – మన ఓటు'
- కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున


విశాలాక్షి నగర్ బీవీకే స్కూల్ పోలింగ్ బూత్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఓటర్లలో చైతన్యం కోసం విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. అందులో భాగంగానే 'మన పోలింగ్ బూత్ . మన ఓటు' కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం చేపట్టిన 'మన పోలింగ్ బూత్– మన ఓటు' కార్యక్రమం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా తూర్పు నియోజకవర్గ పరిధిలోని పెదవాల్తేరులోని కోటక్ సెల్సియస్, విశాలాక్షి నగర్‌లోని బి.వి.కె. స్కూళ్ల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. తూర్పు నియోజకవర్గ ఆర్వో, జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌తో కలిసి కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడి పరిస్థితులను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్‌లను పరిశీలించి అధికారులకు సూచనలు అందజేశారు. ఓటర్ల జాబితాలను పరిశీలించి కిందిస్థాయి అధికారులు, బీఎల్వోలతో మాట్లాడారు. ఆయా కేంద్రాల వద్దకు ఓటు వివరాలు తెలుసుకునేందుకు వచ్చిన సాధారణ పౌరులతో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

ఇద్దరు యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్


యువకులను కాపాడిన లైఫ్ గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్ వద్ద సముద్రంలో కొట్టుకుపోతున్న ఇద్దరు యువకులను లైఫ్‌గార్డ్స్ కాపాడారు. హైదరాబాద్‌కు చెందిన రాజు, సునీల్ కుమార్ ఆదివారం మధ్యాహ్నం సరదాగా గడిపేందుకు ఇక్కడి బీచ్‌కు చేరుకున్నారు. కొంత సమయం తర్వాత సముద్రంలో స్నానానికి దిగారు. అలల ఉధృతికి వీరిద్దరూ కొట్టుకుపోతుండగా.. లైఫ్‌గార్డ్స్ సతీష్, రాజు వీరిని గమనించారు. వెంటనే సముద్రంలోకి దిగి సురక్షితంగా వీరిని తీరానికి తీసుకొచ్చారు. వీరికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

పారా అథ్లెటిక్స్‌లో వారీజా విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో నేత్ర విద్యాలయం యాజమాన్యం

కొమ్మాది: బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో జరిగిన 6వ ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్–2024లో మంగమారిపేటలోని వారీజా నేత్ర విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చూపారు. 100, 400 మీటర్ల పరుగులో దినేష్ బంగారు పతకాలు, రావన్ని రజతాలు, 400 మీటర్ల పరుగులో లలిత స్వర్ణం, 200 మీటర్లలో రెండు రజత పతకాలను సాధించింది. వీరిని వారీజా నేత్ర విద్యాలయం కమిటీ అభినందించింది.

యువ న్యాయవాదుల ‘నేస్తం’

- నెలకు రూ.5 వేలు చొప్పున అందజేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఏడాదికి రూ.60 వేలు చొప్పున మూడేళ్లలో ఒక్కొక్కరికి రూ.1.80 లక్షల లబ్ధి
- సీఎం జగన్‌తోనే మేలు: జూనియర్ లాయర్ల హర్షం

విశాఖ లీగల్/అల్లిపురం: అప్పుడే చదువులు పూర్తై కోర్టుల్లో అడుగుపెడుతున్న తరుణంలో.. యువ న్యాయవాదులు తమ కాళ్ల మీద నిలబడేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భరోసా కల్పించింది. జూనియర్ న్యాయవాదులను ప్రోత్సహిస్తూ.. వృత్తిలో స్థిరపడేలా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ‘వైఎస్సార్ లా నేస్తం’ మంచి ఫలితాలనిచ్చింది. 2019 తర్వాత జూనియర్ న్యాయవాదుల సంఖ్య గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనం. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా జూనియర్ న్యాయవాదులకు అండగా నిలుస్తానని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ లా నేస్తం పథకం అమలు చేశారు. ఈ పథకం ద్వారా నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాదికి రూ.60 వేలు, మూడేళ్లలో ఒక్కొక్కరికి రూ.1.80 లక్షలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. ఇలాంటి పథకం కేవలం మన రాష్ట్రంలో మాత్రమే అమల్లో ఉందని యువ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అడ్వకేట్లకు అన్ని రకాలుగా మంచి జరగాలనే ఉద్దేశంతో రూ.100 కోట్లతో అడ్వకేట్ జనరల్ ఆధ్వర్యంలో వెల్ఫేర్ ట్రస్ట్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

2023లో లా నేస్తం తీసుకున్న యువ న్యాయవాదుల వివరాలివీ..

జిల్లా పేరు	బీసీ	ఓసీ	ఎస్సీ	ఎస్టీ	మొత్తం	లబ్ధి (లక్షల్లో)
అల్లూరి సీతారామరాజు	1	0	5	7	13	రూ.7.80
అనకాపల్లి	45	14	6	1	66	రూ.39.60
విశాఖపట్నం	99	43	23	1	166	రూ.99.60
మొత్తం	145	57	34	9	245	రూ.1.47 (కోట్లు)

నవశకం – సంక్షేమ సంతకం


లా నేస్తం నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున(ఫైల్)

సీఎం జగన్‌తో న్యాయవాదులకు మేలు



2010కి ముందు జూనియర్ న్యాయవాదులు అధికంగా ఉండేవారు. ఆ తర్వాత క్రమంగా వారి సంఖ్య తగ్గింది. 2019 నాటికి న్యాయవాది వృత్తి అంటేనే భయంతో చాలా మంది దూరమయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో జూనియర్ న్యాయవాదులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటి వరకు రూ.42 కోట్ల వరకు లా నేస్తం కింద నిధులు విడుదల చేసి అండగా నిలిచారు. న్యాయవాద సంక్షేమానికి రూ.100 కోట్లతో వెల్ఫేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. గతంలో న్యాయవాదులకు ఏదైనా ప్రమాదం జరిగితే రూ.5 లక్షల వరకు రాష్ట్ర బార్ కౌన్సిల్ అందించేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచారు. కోవిడ్ సమయంలో న్యాయవాదులను ఆదుకున్న తీరు ప్రశంసనీయం. ఎటువంటి షరతులు లేకుండా రూ.25 కోట్ల రుణ సదుపాయం అందించారు. న్యాయవాదుల బీమా సౌకర్యానికి అవసరమైన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వమే అందజేస్తోంది.

–జీఎం రెడ్డి, అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్

మలుపు తిప్పిన లా నేస్తం



న్యాయవాది కావాలన్నది నా బలమైన కోరిక. ఆర్థిక సహాయం లేకపోవడం వల్ల నాకు వచ్చిన పౌరోహిత్యంతో కాలం గడిపాను. లా చదువుకుని ప్రాక్టీస్ చేయలేని పరిస్థితి ఉండేవాడిని. అలాంటి సమయంలో అమల్లోకి వచ్చిన లా నేస్తం.. నా జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. లా నేస్తం కింద నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాది రూ.60 వేలను అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో లా ప్రాక్టీస్ మొదలు పెట్టారు. ప్రస్తుతం సీనియర్ల వద్ద వృత్తిలో మెలకువలు నేర్చుకుంటున్నాను. లా నేస్తం వల్ల నా కుటుంబంపై ఆర్థిక భారం తగ్గింది. సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– జి.ఆనంద భార్గవ్ శర్మ, జూనియర్ న్యాయవాది

మన రాష్ట్రంలోనే అమల్లో ఉంది



నేను ఇంజినీరింగ్ చేసి న్యాయవాద వృత్తిని చేపట్టాను. 2001 నుంచి నాకు లా నేస్తం అందుతోంది. ప్రతి నెలా క్రమం తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు అందజేస్తోంది. ఈ డబ్బులతో నా వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడంతో పాటు పుస్తకాలు కొనుగోలు చేసుకున్నా. అమ్మానాన్నల మీద ఆధారపడకుండా ఈ డబ్బులు నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ప్రతిరోజూ కోర్టుకు వెళుతూ న్యాయవాది వృత్తిలో రాణిస్తున్నాను. ఈ పథకం కేవలం మన రాష్ట్రంలోనే అమల్లో ఉంది. ఇతర రాష్ట్రాల్లో ఇది ప్రతిపాదనలోనే ఉండగా.. మన రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ అభినందనీయం. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– ఎ.సాయి మౌనిక, జూనియర్ న్యాయవాది

మంచి ఆలోచనతో అమలు



జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం ప్రోత్సాహంగా నిలిచింది. ఆర్థికంగానూ, వృత్తి పరంగానూ నిలదొక్కుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి ఆలోచనలతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి, ఏ ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమాన్ని పట్టించుకోలేదు. ముఖ్యంగా జూనియర్ న్యాయవాదులకు అండగా నిలిచింది లేదు. బీసీ, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒకరిద్దరికి మాత్రమే ప్రోత్సాహం అందేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అర్హత గల జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం ద్వారా అండగా నిలిచారు.

– ఎ.కొండాజీ, జూనియర్ న్యాయవాది

జూనియర్లకు పెద్ద గిఫ్ట్



ఇప్పుడిప్పుడే న్యాయవాది వృత్తిని ప్రారంభించిన జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5వేలు ప్రోత్సాహంగా లా నేస్తం ఇవ్వడం పెద్ద గిఫ్ట్. నేను కొత్తగా న్యాయవాది వృత్తిలోకి ప్రవేశించాను. నాకు ఓ నెల లా నేస్తం వచ్చింది. జూనియర్ న్యాయవాదులకు ఎటువంటి కేసులు ఉండవు. నేర్చుకునే సమయంలో ప్రభుత్వం రూ.5 వేలు ప్రోత్సాహకం అందించడం వల్ల మాలాంటి వారికి చాలా మేలు జరుగుతుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– ఎం.వెంకటేష్, జూనియర్ న్యాయవాది

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

సమాధుల వద్ద క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు


వాల్తేర్ సెమిత్రీలో సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

డాబాగార్డెన్స్: ఈస్టర్ సందర్భంగా వాల్తేర్ సెమిత్రీలో ఉదయం 5 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 6 నుంచి బీజెడ్‌ఎల్ బృందం ప్రత్యేక సంగీత కార్యక్రమం అలరించింది. క్రైస్తవులు, వారి బంధువులు, ఆత్మీయుల సమాధులను సందర్శించి, ప్రార్థనలు చేశారు. బంధువులు విడిచిపోయిన వారి సమాధుల వద్ద పాస్టర్లు ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు పునరుత్థాన పండగను పురస్కరించుకుని సమాధులను పెయింటింగ్స్, పువ్వులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో సెమిత్రీ అధ్యక్షుడు జార్జి చీడి, కార్యదర్శి మాథ్యూ పీటర్, కోశాధికారి థామస్ పుల్లెట్ తదితరులు పాల్గొన్నారు.

చూడముచ్చటగా మైదానాలు

- దాతల సహకారంతో అభివృద్ధి
- అయినా తప్పుడు ప్రచారం
- మండిపడ్డ ఏయూ ఇంజినీరింగ్ అధికారులు


ఏయూ మైదానంలో ఆటలు ఆడుకుంటున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం క్రీడా మైదానాలను ప్రజలు, విద్యార్థులకు ఉపయుక్తంగా అభివృద్ధి చేస్తున్నారు. దశాబ్దాలుగా అసాంఘిక శక్తులకు అడ్డాగా.. తుప్పలతో నిండిన స్థలాలను దాతల సాయంతో ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ మైదానాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అయితే కొంత మంది వ్యక్తులు ఏయూలోని మైదానాలను డంపింగ్ యార్డులుగా మార్చేశారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇంజినీరింగ్ విభాగం డీన్ ఆచార్య కె.శ్రీనివాసరావు, యూనివర్సిటీ ఇంజినీర్స్ ఆర్.శంకరరావు, డి.రాజశేఖర్ రాజు ఆదివారం ఓ ప్రకటనలో ఖండించారు. వర్సిటీ, ప్రజలకు ఉపయుక్తంగా మైదానాలను తీర్చిదిద్దుతుంటే.. ఏయూపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే మైదానంలో ప్రధాని మోదీ సభ, జీ–20 సదస్సు, ఇన్వెస్టర్ సమ్మిట్, సంక్రాంతి సంబరాలు, అయ్యప్ప స్వామి పూజలు వంటి ఎన్నో కార్యక్రమాలు జరిగాయని గుర్తు చేశారు.

వాకింగ్‌కు వస్తున్నారు



నూతనంగా అభివృద్ధి చేసిన మైదానంలో నిత్యం వందలాది మంది వాకింగ్‌కి వస్తున్నారు. వారి కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తాం. వర్షాకాలంలో మైదానంలో మట్టి కోతకు గురవకుండా రక్షణ గోడను నిర్మిస్తాం. నగర ప్రజలకు ఉపయుక్తంగా నిలుస్తున్న ఇటువంటి అభివృద్ధి కార్యక్రమాలను తప్పుపట్టడాన్ని చూస్తే.. ఏయూపై బురదజల్లే ప్రయత్నంగా ఇదంతా జరుగుతుందనే సందేహం కలుగుతోంది. ఇప్పటికైనా తప్పుడు కథనాలు మానుకోవాలి.

– ఆర్.శంకరరావు, యూనివర్సిటీ ఇంజినీర్

చాలా బాగుంది

గతంలో తుప్పలతో ఉండే స్థలం.. ఇప్పుడు మంచి మైదానంలా తీర్చిదిద్దారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉండే యువత ఆడుకోవడానికి ఈ మైదానాలు ఎంతో సౌలభ్యంగా ఉన్నాయి. మట్టి వేసి మరింత అభివృద్ధి చేసి.. అందుబాటులో ఉంచడం మంచి పరిణామం.

– జి.సాయికుమార్, మద్దిల పాలెం

రక్షణ గోడల నిర్మాణానికి ఉపయోగిస్తాం



మైదానాలను మరింత అభివృద్ధి చేయడానికి మట్టిని వినియోగిస్తాం. విలువైన రాయిని వర్సిటీ భవనాల నిర్మాణం, భూముల పరిరక్షణకు అవసరమైన ప్రహరీ నిర్మాణానికి ఉపయోగిస్తాం. హాస్టళ్ల చుట్టూ రక్షణ గోడలను ఈ రాయితో నిర్మించడం సాధ్యపడుతుంది. దీన్ని వక్రీకరించడం, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా రాతలు రాయడం సరికాదు.

– డి.రాజశేఖర్ రాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

అన్ని అనుమతులున్నాయి



వర్సిటీ మైదానాలు అభివృద్ధి చేయడానికి అవసరమైన అన్ని అనుమతులు ఉన్నాయి. వర్సిటీపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా.. దాతల సహకారంతో మైదానాలను అభివృద్ధి చేస్తున్నాం. శతాబ్ది ఉత్సవాలకు చేరువవుతున్న సమయంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా సదుపాయాలను కల్పించే ప్రయత్నం జరుగుతోంది. దీనిపై రాద్ధాంతం చేయడం సరికాదు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలకు అందరూ సహకరించాలి.



– ఆచార్య కె.శ్రీనివాసరావు, డీన్, ఏయూ ఇంజినీరింగ్ వర్క్స్

2 నెమళ్లు, 15 నక్షత్ర తాబేళ్ల స్వాధీనం

- 89వ వార్డు సంతోష్‌నగర్‌లో టాస్క్‌ఫోర్స్ దాడులు
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు


నక్షత్ర తాబేళ్లు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు సంతోష్‌నగర్‌లో ఓ వ్యక్తి అక్రమంగా పెంచుతున్న తాబేళ్లు, నెమళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంతోష్‌నగర్‌లో నివాసముంటున్న పిల్ల నాగేశ్వరరావు బాజీ జంక్షన్‌లో పెంపుడు జంతువుల వ్యాపారం చేస్తున్నాడు. గాజువాకకు చెందిన గొందేశి శ్రీనివాసరావు కూడా ఇదే వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల చెన్నైకు చెందిన యువర్ ఫ్రండ్స్ అనే సంస్థ నుంచి నాగేశ్వరరావు రెండు తాబేళ్లు, శ్రీనివాసరావు 13 తాబేళ్లు తెప్పించారు. నాగేశ్వరరావు ఆరు నెలల క్రితం నర్సీపట్నం నుంచి నాలుగు నెమలి గుడ్లను తీసుకొచ్చి కోడితో పొదిగించాడు. అందులో రెండు గుడ్లు పిల్లలయ్యాయి. వాటిని సరదాగా పెంచుకుంటున్నానని చెబుతున్నాడు. నక్షత్ర తాబేలు ఒక్కొక్కటి రూ.25 వేలు నుంచి రూ.50 వేలు వరకు ఉంటుందని పోలీసులు చెప్పారు. వీటితో పాటు నాగేశ్వరరావు ఇంటి వద్ద చెట్టుకు కట్టి ఉన్న దుప్పి కొమ్మును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం వీటిని క్రయ విక్రయాలు చేపట్టడం నిషేధమని పోలీసులు తెలిపారు. వీటిని స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. వాటిని సంరక్షణ నిమిత్తం ఫారెస్ట్ అధికారుల సన్నాహాలు చేస్తున్నారు. నాగేశ్వరరావు ఇచ్చిన సమాచారం మేరకు శ్రీనివాసరావును కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బోనులో ఉంచిన నెమలి పిల్లలు, వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నృసింహ వైభవం

ఐదో రోజు శాస్త్రోక్తంగా సుదర్శన నారసింహ మహాయజ్ఞం


మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు

సింహాచలం: సింహగిరిపై సుదర్శన నారసింహ మహాయజ్ఞం ఐదోరోజు వైభవంగా కొనసాగింది. ఆదివారం కావడం, యజ్ఞంలో పాల్గొనేందుకు ఆఖరిరోజు కావడంతో పెద్ద ఎత్తున ఉభయదాతలు సింహగిరికి తరలివచ్చారు. యజ్ఞంలో పాల్గొన్న ఉభయ దాతలతో యజ్ఞ ప్రాంగణం కిటకిటలాడింది. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి యజ్ఞ ఘట్టాలను దేవస్థానం అర్చకులు, రుత్వికులు నిర్వహించారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఒక పల్లకిలో, చక్రపెరుమాళ్‌ను మరో పల్లకిలో అధిష్టింపజేసి ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న యజ్ఞశాలలోకి తిరువీధిగా తీసుకొచ్చారు. యజ్ఞశాలలో చక్రపెరుమాళ్‌ని ఒక వేదికపై, స్వామివారి ఉత్సవ మూర్తులను మరొక వేదికపై అధిష్టింపజేశారు. ఉభయదాతలకు కంకణధారణ చేసిన అనంతరం యజ్ఞశాలలో ఐదు హోమకుండాల వద్ద యజ్ఞాన్ని నిర్వహించారు. ఉభయదాతల చేత అష్టోత్తర శతనామావళితో స్వామివారి పూజ చేయించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పూర్ణాహుతి నిర్వహించి, ప్రసాదం అందజేశారు. తదుపరి స్వామివారి ఉత్సవమూర్తుల చెంత రామాయణం, భాగవతం, విష్ణుపురాణం, నృసింహ సహస్రనామం, దివ్యప్రబంధం, క్షేత్ర మహాత్మ్యం, సుదర్శన శతకాలను వైదికులు పఠించారు. విశేష హారతులు అందజేశారు.

నేడు మహాపూర్ణాహుతి

సుదర్శన నారసింహ మహా యజ్ఞం సోమవారం పరిసమాప్తం కానుంది. ఉదయం 9.13 గంటలకు మహా పూర్ణాహుతి, తదుపరి శాంతి కల్యాణం నిర్వహించనున్నారు. యజ్ఞం ముగింపును పురస్కరించుకుని సింహగిరికి వచ్చే భక్తులందరికీ అన్నప్రసాద వితరణ భవనంలో అన్నప్రసాదాన్ని అందించే ఏర్పాటు చేశారు.

గంటా రాజకీయమంతా అవినీతిమయం

- సింహాచలం దేవస్థానంలో ఉద్యోగాలు అమ్ముకున్న ఘనుడు
- అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్



సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు అమ్ముకున్న ఘనుడు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అని అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్ ఆరోపించారు. 2014 – 19 మధ్య భీమిలి ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన గంటా శ్రీనివాసరావు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అడవివరంలోని స్వగృహంలో ఆదివారం సాయంత్రం మీడియాతో ప్రసాద్ మాట్లాడారు. సింహాచలం దేవస్థానంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు అమ్ముకున్న నీచమైన మంత్రి ఎవరైనా ఉన్నారంటే అది గంటా శ్రీనివాసరావే అని దుయ్యబట్టారు. దేవస్థానంలో 25 అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకంలో గంటా పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారన్నారు. అప్పట్లో ఎవరైతే టీడీపీ కార్యకర్తలు నిరుద్యోగులుగా ఉన్నారో వారి పేర్లు ఇవ్వాలని తొలుత నన్ను గంటా అడిగారని, పదహారు మంది నిరుద్యోగ టీడీపీ కార్యకర్తల పేర్లు ఇచ్చానన్నారు. కానీ ఒక్కొక్కరి దగ్గర మూడేసి లక్షల రూపాయలు తీసుకుని వేరేవాళ్లకి ఉద్యోగాలు వేశారని ఆరోపించారు. ఆ రోజు తాను ఇచ్చిన జాబితాలోని వారికి ఉద్యోగాలు రాలేదన్నారు. స్వయానా గంటా శ్రీనివాసరావు సతీమణే ఓపెన్ మార్కెట్‌లో అవుట్ సోర్సింగ్ పోస్టులు అమ్మేశారన్నారు. అయినా ఏ ముఖం పెట్టుకుని గంటా మళ్లీ సింహాచలం వచ్చారని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరిట వసూలు చేసిన నగదు స్వామి వారి హుండీలో వేసి ప్రచారం ప్రారంభించాలని తాను సోషల్ మీడియా ద్వారా గంటాను కొద్ది రోజుల కిందట డిమాండ్ చేశానన్నారు. తన హయాంలో అడవివరం గ్రామాన్ని రూ.45 కోట్లతో అభివృద్ధి చేశానని గంటా గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా వుందన్నారు. నా భార్య పాశర్ల వసంత కల్యాణి 2007లో కార్పొరేటర్ అయ్యారని, ఆమె రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేసిందన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన వ్యక్తి రూ.45 కోట్లతో అభివృద్ధి చేశానని చెప్పుకోవడం గొప్ప విషయమా అని ప్రశ్నించారు. భైరవవాకలోని భైరవస్వామి ఆలయానికి రోడ్డు వేయించాలని 2014లో గంటా దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు.

ఏఎంజీ భూములపై గంటా కన్ను

ఏఎంజీ నివాసితులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఘనత కూడా గంటా శ్రీనివాసరావుదే అని పాసర్ల ప్రసాద్ ఆరోపించారు. ఏఎంజీకి ఉన్న 28 ఎకరాలపై గంటా శ్రీనివాసరావు కన్నుపడిందన్నారు. వారికి ప్రత్యామ్నాయం చూపకుండా అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఆ విషయంలో బాధితుల తరపున తాను పోరాటం చేశానన్నారు. భీమిలిలో క్రమశిక్షణ కలిగిన టీడీపీ నాయకులను బ్రోకర్లుగా గంటా మార్చారన్నారు. బ్రోకర్ కార్యాలయంగా టీడీపీ కార్యాలయాన్ని తయారు చేశారన్నారు. 2019లో విశాఖ ఉత్తరంలో టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన గంటా ఏ రోజూ ప్రజల్లో తిరగలేదన్నారు. అవినీతి గంటాకి మళ్లీ భీమిలి సీటు చంద్రబాబు కేటాయించారంటే చంద్రబాబుకి మైండ్ సరిగ్గా పనిచేస్తుందో... లేదో... తెలియడం లేదన్నారు.

మరణంలోనూ వీడని స్నేహబంధం

- బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకుల దుర్మరణం
- వివాహ వేడుకకు వెళ్లి వస్తుండగా ప్రమాదం
- మృతుల్లో ఒకరు విశాఖ నగర వాసి



కొర్రా చిరంజీవి, లగుడు శంకరరావు మృతదేహాలు

పాడేరు: వారిద్దరు స్నేహితులు.. కలిసి మెలిసి ఉండేవారు.. వివాహ వేడుకకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్న వీరు ప్రాణాలు కోల్పోయారు. మృత్యువు వీరి స్నేహబంధాన్ని విడదీయలేకపోయింది. ఆయా కుటుంబాలకు తీరని విషాదం మిగిల్చింది. ఇరడాపల్లి పంచాయతీ సంతగండు వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయతీ మేడూరుకు చెందిన చిరంజీవి, నగరంలోని కైలాసపురానికి చెందిన లగుడు శంకరరావు మృతిచెందారు.

సంఘటన స్థలంలో ఒకరు.. ఆస్పత్రికి తరలిస్తుండగా మరొకరు..

విశాఖ నగరంలోని ఏవీఎన్ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న వీరిద్దరు ఈనెల 29న మేడూరు వచ్చారు. ఆరోజంతా అక్కడే సంతోషంగా గడిపారు. మరుసటి రోజు పాడేరు మండలం సంతగుండులో వివాహ కార్యక్రమానికి బైక్‌పై వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తరువాత అదే రోజు రాత్రి 1.30 గంటల సమయంలో బైక్‌పై మేడూరు బయలుదేరారు. సంతగండు ప్రధాన రహదారి వచ్చేసరికి బైక్‌పై ఎదురుగా వస్తున్న జి.మాడుగుల మండలం కె.కోడాపల్లికి చెందిన సాగెని ప్రదీప్ ఢీకొట్టాడు. దీంతో చిరంజీవి, శంకరరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. చిరంజీవి సంఘటన స్థలంలో మృతి చెందాడు. శంకరరావును 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. తీవ్రంగా గాయపడిన ప్రదీప్‌ను అత్యవసర వైద్యం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్టు పాడేరు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వివరించారు.